దుండగులను కఠినంగా శిక్షించాలి

కోహీర్, ఆగస్టు17: కోల్‌కతాలో వైద్యురాలి మృతికి కారణమైన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం జహీరాబాద్, కోహీర్ ప్రభుత్వ దవాఖానల్లోని వైద్యులు, సిబ్బంది ఆమె మృతి పట్ల నిరసన వ్యక్తం చేశారు. దుండగులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

జిన్నారం: మాదారం గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

న్యాల్‌కల్‌లో నివాళి

న్యాల్‌కల్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్జే మెడికల్ కాలేజీలో ట్రైనీ మహిళా డాక్టర్ దారుణహత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని న్యాల్‌కల్ మండల వైద్యాధికారులు, సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన న్యాల్‌కల్, మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయా ఆరోగ్య కేంద్రాల్లో హత్యకు గురైన మహిళా డాక్టర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గణపతిరావు, నృపేన్‌చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోహీర్: జహీరాబాద్‌లో నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

న్యాల్‌కల్: నివాళులర్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

నారాయణఖేడ్: నిరసన తెలుపుతున్న డాక్టర్లు

అధికారులు అందుబాటులో ఉండాలి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, ఆగస్టు17: వర్షాలతో కాలనీ ప్రజలు పడుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఇంద్రప్రస్థ కాలనీ వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే మాణిక్‌రావుకు దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి ఆయన కాలనీని సందర్శించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. మున్సిపల్ అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఫోన్ ద్వారా కోరారు. వర్షపు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మారడం లేదని మండిపడ్డారు. మున్సిపల్ అధికారుల పనితీరు మారకుంటే కలెక్టర్‌కు అవసరమైతే సీఎంకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి ఉన్నారు.

సదాశివపేటలో బంద్ ప్రశాంతం

సదాశివపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందు సంఘాల నాయకులు

సదాశివపేట, ఆగస్టు17: హిందూ సంఘాల ఆధ్వర్యంలో సదాశివపేటలో శనివారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా జరిగింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులకు నిరసనగా పట్టణంలో స్వచ్ఛందంగా బంద్ చేపట్టారు. స్థానిక బసవేశ్వర మందిరం నుంచి గాంధీచౌక్, శాస్త్రీ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వీరేశంకు వినతిపత్రం అందజేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి బంగ్లాదేశ్ హిందువులకు బాసటగా నిలిచి న్యాయం చేయాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బోనాలకు చకచకా ఏర్పాట్లు

రామచంద్రాపురం, ఆగస్టు17: ఆర్సీపురం డివిజన్‌లోని ఐదుగుళ్ల పోచమ్మ, మహంకాళి, భారతీనగర్ డివిజన్‌లోని బొంబాయి కాలనీలో ఉన్న నల్లపోచమ్మ ఆలయాల్లో ఆదివారం శ్రావణమాస బోనాల వేడుకలు జరగనున్నాయి. బోనాలకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. అయా అమ్మవారి ఆలయాలను రంగులతో ముస్తాబుచేసి విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఆర్సీపురం డివిజన్‌లోని ఆయా ఆలయాలను కార్పొరేటర్ పుష్పానగేశ్ సందర్శించి బల్దియా నుంచి ఏర్పాట్లు చేశారు. భారతీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, సర్కిల్ యూత్ అధ్యక్షుడు నర్సింహ సందర్శించి బోనాలకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

బోనాలకు ఏర్పాట్లు చేయిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

వరద నీటిని మళ్లించిన కార్పొరేటర్

పటాన్‌చెరు, ఆగస్టు 17: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ కాలనీలోని గాడిదకుంట చెరువు నిండడంతో సమీపంలోని ఇండ్లలోకి వరద నీరు చేరి స్థానికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ శనివారం వరద ముంపునకు గురైన ఇండ్లను పరిశీలించారు. వెంటనే జీహెచ్ఎంసీ సిబ్బందిని నియమించి జేసీబీ సహాయంతో గాడిదకుంట ప్రధాన అలుగు ద్వారం గుండా వరద నీరు తొలిగించేలా పూడికతీత పనులు చేయించారు. వరద సహాయక చర్యల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వరద నీటిని తొలిగింపజేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

గుమ్మడిదల, ఆగస్టు17: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదిక ప్రాంగణంలో మండలంలోని పలు గ్రామాల్లోని 90 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెండ్లి భారం కాకూడదన్న సమ్మున్నత లక్ష్యంతో పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ సద్ది ప్రవీణావి జయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్టనసర్సింగ్‌రావు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జిన్నారం, ఆగస్టు 17: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం జిన్నారంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై వివిధ గ్రామాలకు చెందిన 117 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.17 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. బొల్లారం మున్సిపల్ చైర్మన్ రోజా బాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ ఉన్నారు.

'మాది కాంగ్రెస్ అని చెప్పకోలేకపోతున్నాం'

హత్నూర వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, రైతులు

హత్నూర, ఆగస్టు 17: మాది కాంగ్రెస్ అని చెప్పుకోవటానికి సిగ్గేస్తున్నదని హత్నూర మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు సొంత పార్టీపై నిప్పులు చెరిగారు. సంబంధిత అధికారులు అందుబాటులో ఉండటం లేదని ఆరోపిస్తూ రైతులతో కలిసి హత్నూర వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ కోసం బ్యాంకుకు వెళ్తే వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి తెలుసుకోవాలని చెప్పడంతో వారం రోజులుగా తిరుగుతున్నా అధికారులు అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని కోరారు. హత్నూర మాజీ సర్పంచ్ కిష్టయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నల్లోళ్ల పెంటయ్య, నాయకులు పెంటేశ్, రాములు, లింగం పాల్గొన్నారు.

అందరికీ పంట రుణమాఫీ చేయాలి

ఖానాపూర్ కేలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఆగస్టు 17: ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేసినప్పుడే నాయకులు సంబురాలు చేసుకోవాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఖానాపూర్ కేలోని తన నివాస గృహంలో శనివారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎస్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానకాలంలో రైతు భరోసా ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని ఆరోపించారు. ప్రతి రైతుకూ రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని అరకొర ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, సిర్గాపూర్ మాజీ ఎంపీపీ మైపాల్‌రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ దిలీప్‌కుమార్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు అలీ, నాయకులు కిష్టాగౌడ్, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అంజయ్య సాగర్, గోపాల్‌రెడ్డి, దాడే పండరి, పీరయ్య, సాయిలు, ప్రశాంత్ సాగర్, వెంకటేశం, పోచయ్య ఉన్నారు.

నూతన గృహ ప్రవేశానికి హాజరు

నిజాంపేట్, ఆగస్టు17: నిజాంపేట్ మండల పరిధిలోని దామర్‌చెరువు గ్రామానికి చెదిన పోగుల బాలయ్య తన స్వగ్రామం దామర్‌చెరువులో శనివారం గృహ ప్రవేశ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు శ్రేయ రెడ్డి, తాజా మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, నిజాంపేట్ మాజీ సర్పంచ్ జగదీశ్వరచారి, ఉపసర్పంచ్ సంగయ్య, సంతోష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నిజాంపేట్, ఆగస్టు 17: నారాయణఖేడ్ నియోజకవర్గం నిజాంపేట్ మండలం మునిగేపల్లి పంచాయతీ పరిధిలోని నన్యనాయక్ తండాకు చెందిన పకిర్య నాయక్ ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు వారి కూతురు శ్రేయారెడ్డి, తాజా మాజీ ఎంపీపీ సాయి రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర చారి, మునిగేపల్లి నవాబ్ పాటిల్, పుట్టి కాశీనాథం, మన్నె లింగం ఉన్నారు.

అంత్వార్ గ్రామంలో..

నారాయణఖేడ్, ఆగస్టు 17: మండలంలోని అంత్వార్ మాజీ సర్పంచ్ నిజలింగప్ప మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. తండ్రి శంకర్‌రావు పాటిల్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. సర్పంచ్‌గా నిజలింగప్ప గ్రామానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. నాయకులు సాల్మన్, ఎంఏ నజీబ్, నగేశ్, మల్‌గొండ న్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 17: జిల్లాలో 18 ఏండ్లు నిండిన వారందరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీఈవో ఓటరు జాబితా సవరణ 2025పై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 20 నుంచి బీఎల్‌వో ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. అక్టోబర్ 29న ముసాయిదా విడుదల, నవంబర్ 28 వరకు అభ్యంతరాల స్వీకరణ, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఈఆర్‌వో, ఏఈఆర్, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే చేపడతారని వివరించారు. అదనపు కలెక్టర్ మాధురి పాల్గొన్నారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి

పంట రుణమాఫీ కలేనా?

గుమ్మడిదల,ఆగస్టు17: కాంగ్రెస్ సర్కారులో పంట రుణమాఫీ కలగానే మిగులుతున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నల్లవల్లి గ్రామానికి చెందిన చాపల కళావతి(తల్లి), చాపల మధు(కొడుకు) ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన వారు. వీరికి ఒకటే రేషన్ కార్డు ఉంది. గతంలో వీరు పంట రుణాలు తీసుకున్నారు. తల్లి కళావతికి రూ.లక్షా 67,688 బ్యాంకు రుణం ఉంది. కొడుకు చాపల మధుకు రూ.97,581 బ్యాంకు రుణం ఉంది. ఇద్దరికీ పంట రుణమాఫీ కాకపోవడంతో వ్యవసాయాధికారిని సంప్రదించారు. రేషన్ కార్డులో రెండు యూనిట్లు ఉన్నా ఒక్క యూనిట్ కూడా రుణమాఫీ కాలేదని వాపోయారు. ఇప్పటికైనా మాలాంటి రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

పాసుబుక్ చూపిస్తున్న కళావతి, మధు

వర్షాల కోసం పూజలు

కల్హేర్, ఆగస్టు 1: వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని 11 హనుమాన్ మందిరాల్లో యువకులు, నాయకులు బైక్ ర్యాలీగా వెళ్లి పూజలు చేశారు. వానలు లేక చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. బోరు బావుల కింద పంట చేతికందుతుందో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. విస్తారంగా వర్షాలు కురిసి చెరువు, కుంటలు నిండాలని కల్హేర్, పిట్లం మండలాల్లోని ఆలయాలల్లో పూజలు చేశారు.

ఘనంగా సర్దార్ పాపన్న జయంతి

వెంకటాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

కోహీర్, ఆగస్టు17: మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి విఠల్‌గౌడ్, మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ మాణయ్యగౌడ్, మాజీ సర్పంచ్ రాజశేఖర్, రంగయ్యగౌడ్, లక్ష్మయ్యగౌడ్, శేఖర్‌గౌడ్, రాజు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

సిర్గాపూర్, ఆగస్టు 17: మండలంలోని బొక్కస్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. శనివారం పాఠశాలలో స్థానిక మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న రవీందర్, శ్యామలను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం నర్సింగ్ పాల్గొన్నారు.

పాఠశాలలో సామూహిక రక్షాబంధన్

సిర్గాపూర్, ఆగస్టు 17: మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సామూహిక రక్షాబంధన్ కార్యక్రమాన్ని జీహెచ్ఎం నాగారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పాఠశాల గ్రౌండ్‌లో బాలికలు, తోటి విద్యార్థులైన బాలురలకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. నీకు నేను రక్ష, నాకు నీవు రక్ష, మనమిద్దరం దేశానికి రక్ష అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శివకుమార్ స్వామి, టీచర్లు ఉన్నారు.

బాలురకు రాఖీ కడుతున్న బాలికలు

నిందితుల అరెస్టు

నారాయణఖేడ్, ఆగస్టు 17: రెండు చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ర్యాకల్ గ్రామంలో ఈనెల 14వ తేదీన పంచగామ సుశీల ఇంట్లో చోరీ జరుగగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పాండు మన్సూర్‌పూర్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద నుంచి 24 గ్రాముల బంగారం, 40 తులాల వెండిని స్వాధీనం చేసుకొన్నారు. ఈ నెల 15వ తేదీన మండల పరిధిలోని సత్యగామ గ్రామంలో హట్కరి యాదవరావు ఇంటి ఎదుట నిలిపి ఉంచిన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు కేసు నమోదైంది. ఈ క్రమంలో పంచగామ కమాన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మనూరు మండలం తుమ్నూర్ గ్రామానికి చెందిన బేగరి లక్ష్మణ్ టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వస్తూ తమను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారణలో ఎక్సెల్ వాహనాన్ని దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. లక్ష్మణ్ గతంలో పలు కేసుల్లో జైలుకు సైతం వెళ్లివచ్చాడు. ఈ మేరకు ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

మునిపల్లి, ఆగస్టు 17: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అల్లాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ యేసయ్య కథనం ప్రకారం.. అల్లాపూర్ గ్రామానికి చెందిన అర్జున్ లక్ష్మణ్(32) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. శనివారం విపరీతమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. అతడి భార్య అనిత ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

ఫైలేరియాపై అవగాహన

మ్మడిదల, ఆగస్టు17: మండల వ్యాప్తంగా ఫైలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మండల వైద్యాధికారి మధుకర్ అన్నారు. శనివారం మండలంలోని దోమడుగులోని మహిళా సంఘం భవనంలో గ్రామస్తులకు మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఎంపీహెచ్ఈవో శ్రీనివాస్‌రావు ఫైలేరియా నిర్మూలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా కారక దోమ మనిషిని కుట్టినప్పుడు జ్వరం, విరేచనలు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ దోమ కరిచిన చాలా రోజుల తర్వాత ఫైలేరియాకు గురవుతారని చెప్పారు. వాటికి సంబంధించిన టీకాలను పీహెచ్‌సీలో వేస్తామన్నారు. వ్యాధి నిర్మూలన మాత్రలు అందజేస్తున్నామని తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకి ఆహ్వానపత్రికను ఇస్తున్న నాయకులు

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వానం

రామచంద్రాపురం, ఆగస్టు17: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఆదివారం జరుగనున్న ఐదుగుళ్ల పోచమ్మ అమ్మవారి బోనాలకు రావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుని బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, అంజయ్యయాదవ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా శనివారం బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి హరీశ్‌రావుని ప్రత్యేకంగా కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, గడ్డం కుమార్, దశరథ్, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్స్, నోట్‌బుక్స్ పంపిణీ

కులబ్‌గూర్ పాఠశాలలో విద్యార్థులకు నోట్స్, బ్యాగులు పంపిణీ చేస్తున్న ప్రకాశ్

సంగారెడ్డి, ఆగస్టు 17: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్స్, పెన్సిల్స్ కిట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. శనివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త కార్యదర్శి పుల్లూరి ప్రకాశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని కులబ్‌గూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు తన పుట్టినరోజున సహాయం చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు జ్యోతిర్మయి, ప్రదీప్‌కుమార్, భాస్కర్, విద్యాసాగర్, వెంకటేశం, పద్మ, ఎల్ఐసీ అధికారి గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అరుణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

న్యాల్‌కల్, ఆగస్టు 17: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని హద్నూర్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మిర్జాపూర్(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల సహకారంలో విద్యార్థులకు ఐడీ కార్డులు, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా విద్యార్థులకు చక్కగా పాఠాలను బోధించి తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల పీజీ హెచ్ఎం రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వావిలాలలో విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

జిన్నారం, ఆగస్టు 17: మండలంలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బీహెచ్ఈఎల్ రిటైర్డ్ ఉద్యోగి నందిగామ నగేశ్ తన జన్మదినం సందర్భంగా శనివారం డిక్షనరీలను పంపిణీ చేశారు. పాఠశాల అవసరాల కోసం రూ.లక్ష అందజేస్తానని తెలిపారు. హెచ్ఎం విజయకుమార్, ఈవో అనుపమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేతకీలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

ఝరాసంగం, ఆగస్టు 17: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయంలో ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని జంగమ సమాజం మండల ఉప అధ్యక్షుడు మల్లయ్య స్వామి దేవదాయ శాఖకు విజ్ఞప్తి చేశారు. ఆలయంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో 6బీ టెంపుల్ పరిధిలో పనిచేసే ఉద్యోగి 6ఏ పరిధిలో పనిచేయడం సబబు కాదన్నారు. సంవత్సరానికి దాదాపు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల ఆదాయం ఉన్న ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే ప్రైవేట్‌కు సంబంధించిన ఓ ఫంక్షన్ హాల్‌ను అద్దెకు తీసుకోవడం సమంజసం కాదన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు

సిర్గాపూర్, ఆగస్టు 17: అమ్మాయిలను వేధించి అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అక్కడక్కడ యువత ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి కేసులో 20 ఏండ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. అనవసరంగా తమ జీవితాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు.